


## 'అ ఆ' లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

### గురుదేవోభ్యోన్నమః

– భమిడిపాటి ఫణిబాబు

నేను 1958 నుండి 1962 దాకా అమలాపురం శ్రీ కోనసీమ భానోజీ రామర్స్ కాలేజ్‌లో చదువుకున్నాను. ఆ రోజుల్లో మాకు విద్య నేర్పిన కొందరు గురువులను ఈ వ్యాసం ద్వారా గుర్తు చేసుకోవడానికి ఈ ప్రయత్నం. వారు నేర్పిన పాఠాలు జీవితంలో ఎంతో ఉపయోగించాయి.

ముందుగా చెప్పవలసింది మా ప్రిన్సిపాల్ - శ్రీ పెద్దాడ రామచంద్రరావుగారు. ఆయన డిగ్రీ క్లాసులన్నింటికీ కలిపి ఇంగ్లీష్ డ్రామా (షేక్స్‌ఫియర్) చెప్పేవారు. మాకు ఆయన ద్వారా నేర్చుకునే అదృష్టం ఎంతో కాలం కలగలేదు - వారు సర్వీస్‌లో ఉండగానే దివంగతులైనారు.

ఇంగ్లీష్‌కి శ్రీ జి. కృష్ణమూర్తిగారు, శ్రీ ఆర్.రామకృష్ణారావుగారు - వారు చెప్పే విధానం చెప్పనలవికాదు. అరటిపండు వలచి చేతులో పెట్టేటట్లుగా ఉండేది. ఆరోజుల్లో వారు చెప్పిన పద్ధతి ఇప్పటికీ మర్చిపోలేదు.

తెలుగులో శ్రీవెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు - ఆయన తెలుగులో పద్యం చదివి తాత్పర్యం చెపితే ఇంక మరిచిపోవడం అనే మాట ఉండదు. క్లాస్‌లో ఎంత పెద్దవాడినైనా సరే "ఏరా" అనే సంభోదించేవారు. ఆయన చేతి చివాట్లు తినడం ఒక వరంగా ఉండేది. ఎవ్వరూ క్లాస్ మానేవారు కాదు.

మాథమేటిక్స్‌కి వస్తే శ్రీ జి.పి.రామేశంగారు - ఆయన దగ్గర నేర్చుకున్నవాళ్ళు ఎవరూ లెఖ్ఖలు అంటే భయపడేవాళ్ళుకాదు. అంత సులభం చేశారు. అలాగే శ్రీ చిదంబరంగారు, అలాగే మా అక్కయ్యగారు కందా భాస్కరంగారు.

ఫిజిక్స్‌కి వస్తే శ్రీ దాసు ఉపేంద్రరావుగారు, డి. రామకోటేశ్వరరావుగారు, కందుకూరి పుండరీకాక్షుడుగారు.

కెమిస్ట్రీకి శ్రీ జి.వి.ఎస్. రామారావుగారు, శ్రీ వెంకట రత్నంగారు. కెమిస్ట్రీ ఇంత సులభమా అనిపించేలాగ చెప్పేవారు.

ఇవి కాకుండా జనరల్ ఎడ్యుకేషన్ అని ఉండేది - హిస్టరీ, పోలిటిక్స్, ఎకనామిక్స్ - శ్రీ శ్రీరామశర్మగారు హిస్టరీ, శ్రీ వేణుగోపాల్ గారు సివిక్స్, శ్రీ పేరి శాస్త్రిగారు ఎకనామిక్స్ చెప్పేవారు. శ్రీ జి.వెంకటేశ్వర్లుగారు వరల్డ్ హిస్టరీ చెప్పేవారు.

వీరే కాఉండా, శ్రీ వక్కలంక లక్ష్మీపతి రావుగారు, శ్రీ జి.వి కృష్ణారావుగారు, శ్రీ పారుపూడి వెంకట్రావు గారు, ఆయన సిస్టర్ వెంకటరత్నం గారు, శ్రీ బాలాంత్రపు శ్యామలరావుగారు, శ్రీ పి.డి.విల్సన్‌గారు.

పైన పేర్కొన్న వారందరూ కూడా చదువు నేర్పడం ఒక యజ్ఞంలా నిర్వహించేవారు, అంటే ఏదో అందరినీ శ్రమ పెట్టడం కాదు. చదువు మీద ధ్యాస ఉండేటట్లుగా చెయ్యడం అన్నమాట. వాతావరణం కూడా చాలా ప్రశాంతంగా ఉండేది. ఈనాడు ఉన్నట్లుగా కాలుష్యం ఉండేది కాదు. పిల్లలలో ఒక క్రమశిక్షణ, నేర్చుకోవాలనే తపన ఉండేది.

ఆ రోజులు గుర్తుచేసుకోవడం మీతో పంచుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

శ్రీ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారికి పోతన అంటే చాలా అభిమానం. భాగవతం నుంచి అన్ని పద్యాలకు టీకా, తాత్పర్యంతో సహా వీలు ఉన్నప్పుడు చెప్పేవారు. ఆయన క్లాసులోకి రాగానే అందరికీ విపరీతమైన నవ్వు వచ్చేసేది. ఇంకొక తెలుగు మాష్టారు శ్రీ వక్కలంక లక్ష్మీపతిగారికి శ్రీనాధుడు అంటే చాలా ఇష్టం, ఈయన క్లాస్‌లో శ్రీనాధుడి గురించి బ్రెయిన్ వాష్ అయితే, శ్రీవెంపరాల వారి క్లాస్‌లో పోతన గురించి అయ్యేది. వీళ్ళ దెబ్బలాట మూలంగా మాకు మంచి వినోదంగా ఉండేది. శ్రీ సూర్యనారాయణగారు మాకు చుట్టం కూడాను, అంటే మా అమ్మమ్మగారి ద్వారా, ఎప్పుడైనా కాలేజ్‌లో ఏమైనా అల్లరి చేస్తే ఆ సాయంత్రానికి ఇంటికి రిపోర్ట్ వెళ్ళిపోయేది!!

అలాగే లెక్కలకి కందా భాస్కరంగారు వచ్చేవారు అన్నాను కదా ఆవిడ మా అక్కయ్యగారు - అంటే మా పెద్దమ్మగారి కూతురు. అదేకాకుండా మా నాన్నగారు అమలాపురం హైస్కూల్‌కి హెడ్మాష్టర్‌గా ఉండేవారు. దీనివలన నాకు కాలేజ్‌లో ఏమీ పిచ్చి పిచ్చి వేషాలు వేయడానికి వీలుండేది కాదు. పైగా ఊరు చిన్నది అవడం మూలంగా విషయాలు అందరికీ తెలుస్తాయి.

నాకు కొంచెం కాలు నొప్పి అవడం వలన గేమ్స్ దేనిలోనూ పాల్గొనడానికి పర్మిషన్ ఉండేది కాదు. ఎలాగో ఇంట్లో వాళ్ళ కళ్ళు కప్పి క్రికెట్ ఆడేవాడిని.

శ్రీ జి.పి.రామేశంగారు పాఠం (ఆయన జామెంట్రీ, ఎస్ట్రానమీకి వచ్చేవారు) మొదలుపెడితే విరామం ఉండేది కాదు. నాన్ స్టాప్‌గా చెప్పేవారు. ప్రతి మాట తరువాత "మా" అనేవారు. అంటే "టెక్ ఫర్ ఎక్సాంపుల్" అనాలంటే "టేక్ మా ఫర్ మా ఎక్సాంపుల్ మా" అన్నమాట కానీ దీనివలన ఎవరికీ సమస్య ఉండేది కాదు వింటే భారతం వినాలి లేకపోతే రామేశంగారి దగ్గర మేథ్స్ నేర్చుకోవాలి అనేవారు. శ్రీ పెద్దాడ రామచంద్రరావుగారు దిగవంతులైన తరువాత శ్రీ రామేశంగారిని ప్రిన్సిపాల్‌గా చేశారు. అప్పటినుంచీ క్లాసులు తీసుకోవడం తగ్గింది.

ఇంక ఇంగ్లీష్ చెప్పిన శ్రీ ఆర్.ఆర్.కె గారి పద్ధతి చాలా బాగుండేది. దేనికైనా అర్థం ఆయన డైరెక్ట్‌గా చెప్పేవారు కాదు, మనచేతే చెప్పించడానికి ప్రయత్నం చేసేవారు. దానివలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి - అప్పుడు నేర్చుకున్నవి మళ్ళీ మరచిపోలేదు.

శ్రీరామశర్మగారు నేర్పిన హిస్టరీ అయితే చెప్పఖ్ఖర్లేదు. అదొక కథలాగ చెప్పేవారు. ఆరోజుల్లో హైస్కూల్ చదువులు తెలుగులోనే అయ్యేవి. అయినా హిస్టరీ కాలేజ్‌లో ఇంగ్లీష్‌లో చెప్పినా ఏమీ కష్టం అయేదికాదు. దానికంతా ఆయన చెప్పే పద్ధతిలో ఉండేది. ఎక్కడెక్కడివో విషయాలు చెప్పి పాఠాన్ని చాలా ఆకర్షణీయంగా చెప్పేవారు.

అలాగే శ్రీ రామకోటేశ్వరరావు గారు ఫిజిక్స్, శ్రీవెంకటరత్నగారు చెప్పే కెమిస్ట్రీ వింటే చదువు మీద ఇష్టం ఏర్పడేది. వారు ఏదో చెప్పేసి కోర్స్ పూర్తిచేయడం ధ్యేయంగా కాకుండా, మనకి అర్థం అయిందా లేదా అని చూసేవారు.అవసరమైతే కాలేజ్ అయిన తరువాత కూడా ఉండి సహాయం చేసేవారు. చదువులు కమర్షియల్ అయిన ఈ రోజులు చూస్తుంటే మేము ఎంత అదృష్టవంతులమో అనిపిస్తుంది. మేము నేర్చుకున్నది, ఈనాటితో చూస్తే చాలా తక్కువ అయి ఉండవచ్చు, కానీ నేర్చుకున్నది ఎప్పటికీ మర్చిపోలేము.



ఫణిబాబు గారు 1963లో పూనాలోని ఆర్డినెన్స్ ఫేక్టరీలో చేరి 2005 సంవత్సరంలో రిటైర్ అయ్యారు. గోదావరి తీరంలో కొంతకాలం ఉండాలనే సదుద్దేశంతో ప్రస్తుతం రాజమండ్రిలో గోదావరి గట్టున ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. తెలుగు అంటే వెర్రి అభిమానం. ఇటీవలే బ్లాగులోకంలో అడుగుపెట్టి అనేకమంది అభిమానులని సంపాదించుకున్నారు.